RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్
సంపుటి : 3, సంచిక : 286

శనివారం
అక్టోబర్ 18, 2025


పేజీలు : 4
వెల : రూ.3-00



ఏం సాధించారని విజయోత్సవాలు

4లో..

# 'లోన్'..@ లైఫ్ గాన్..!




- ☐ అనవసర రుణంతో ఆర్థిక చిక్కులు..!
- ☐ ఈఎంఐ చెల్లించకపోతే అంతే మరి.. జాగ్రత్త!
- ☐ లోన్ తీసుకునే ముందు ఆలోచించు..
- ☐ వడ్డీ భారం, పెనాల్టీ బెడద తప్పదు
- ☐ నిర్లక్ష్యం వహిస్తే జీవితం నాశనం!


వేద న్యూస్, డెస్క్ :

ఆర్థికంగా ఎదుగుదల ప్రతి ఒక్కరూ కోరుకునే అంశం. కానీ, ఏ విధంగా అనేది కీలకమని నిపుణులు చెబుతున్నారు. ఇటీవల చాలా మంది అవసరం లేకుండా లోన్‌లు తీసుకుని, చెల్లించకుండా ఆర్థిక ఉచ్చులో చిక్కుకుంటున్నారు. కొత్త ఫోన్, బైక్, లగ్జరీ కారు లేదా విహారయాత్రల కోసం తీసుకున్న లోన్‌లు జీవితాన్ని నాశనం చేస్తున్నాయి. సకాలంలో ఈఎంఐ చెల్లించకపోతే కోర్టు నోటీసులు, అరెస్ట్‌లు, జైలు శిక్షలు, సమాజంలో అవమానం తప్పవు. ఈ సమస్య గురించి ఒక్క క్షణం ఆలోచించండి మీ భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉంది..!ఈ విషయం గుర్తించాలని సూచిస్తున్నారు.

**– నో ఫైనాన్షియల్ ప్లాన్**

ఆర్థిక ప్రణాళిక లేకుండా, తమ ఆదాయం గురించి ఆలోచించకుండా లోన్‌లు తీసుకుంటున్నారు. అనవసరమైన వస్తువుల కోసం లోన్ తీసుకోవడం వల్ల ఆర్థిక భారం పెరుగుతునాది. కొందరు లోన్ తీసుకున్న తర్వాత ఈఎంఐ లను చెల్లించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. ఆదాయంలో అస్థిరత, ఊహించని ఖర్చులు లేదా లోన్ ఒప్పందం గురించి అవగాహన లేకపోవడం దీనికి కారణాలు. చెల్లించని లోన్‌లపై వడ్డీ, పెనాల్టీలు పెరిగి, అప్పు భారీ మొత్తంగా మారుతుంది. ఇది ఒక ఆర్థిక ఉచ్చులాంటిది, దీనిలో చిక్కుకుంటే బయటపడడం కష్టం. ఫైనాన్స్ సంస్థలు లోన్ వసూలు చేయడానికి రికవరీ ఏజెంట్లను పంపడం లేదా ఫోన్ కాల్స్ ద్వారా ఒత్తిడి చేయడం చేస్తాయి. కానీ, ఈ హెచ్చరికలను పట్టించుకోని వారి పరిస్థితి మరింత దిగజారుతుంది. చెల్లింపులు ఆలస్యమైతే, కోర్టు నుండి నోటీసులు వస్తాయి. ఇవి కూడా నిర్లక్ష్యం చేస్తే, ఫైనాన్స్ సంస్థలు పోలీస్ స్టేషన్‌లో నాన్-బెయిలబుల్ వారెంట్ కింద కేసు ఫైల్ చేయవచ్చు. దీని వల్ల అరెస్ట్, ఆరు నెలల జైలు శిక్ష, లీగల్ ఫీజు, పెనాల్టీలు వంటి భారీ ఖర్చులు తప్పవు. ఇంతటితో ఆగదు సమాజంలో మానసిక ఒత్తిడి, పరువు నష్టం, కుటుంబ సభ్యులకు ఇబ్బందులు ఎదురవుతాయి. లోన్ చెల్లించకపోవడం వల్ల క్రెడిట్ స్కోర్ దెబ్బతిని, భవిష్యత్తులో లోన్‌లు లేదా ఆర్థిక సహాయం పొందడం కష్టమవుతుంది. సమాజంలో గౌరవం కోల్పోవడం, మానసిక ఒత్తిడి వంటి సమస్యలు తలెత్తుతాయి. ఇది కేవలం వ్యక్తిగత నష్టంతో ఆగదు ఫైనాన్స్ సంస్థలు కూడా నష్టపోతాయి. దీని వల్ల వారు వడ్డీ రేట్లను

మిగతా 3వ పేజీలో..






## కేజీబీవీ తనిఖీ చేసిన కలెక్టర్

**వేద న్యూస్, వరంగల్:**

వరంగల్ జిల్లా ఖానాపూర్ మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)లో కలెక్టర్ డాక్టర్ సత్య శారద శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కిచెన్, వంట గది, స్టోర్ రూమ్, భోజనానికి వినియోగించే ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. భోజన నాణ్యతను పరిశీలించి, కూరల రుచిని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మెనును ఖచ్చితంగా పాటించాలన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది హాజరుపై ఆరా తీశారు.కేజీబీవీ లో విద్యార్థుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన తలుపులు, ఇనుప గ్రిల్స్, టాయిలెట్ల మనమ్మత్తులను, ఆరో ప్లాంట్, కిచెన్ రూఫ్ తదితర పూర్తయిన పనులను కలెక్టర్ పరిశీలించారు. కోతులు వస్తున్నాయని ఈ సందర్భంగా కలెక్టర్ దృష్టికి తీసుకురాగా కోతులు రాకుండా వెంటనే మెష్ ఏర్పాటు చేయాలని డీఈ ను ఆదేశించారు.వారంలో ఒకరోజు తెలుగు, హిందీ, ఇంగ్లీష్ డేగా నిర్ణయించి ఆరోజు పిల్లలతో అదే భాష రోజు మొత్తం మాట్లాడించాలని, దీనితో వారి వకాబులరీ పెరుగుతుందన్నారు . విద్యార్థులతో ముచ్చటించి వారి పట్టణ సామర్థ్యాన్ని తెలుసుకొని ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. విద్యార్థులకు ఏమన్నా సమస్యలు ఉంటే ఏర్పాటు చేసిన కంప్లైంట్ బాక్స్ లో వేయాలన్నారు. క్రీడల కొరకు వాలీబాల్ బాస్కెట్బాల్, ఖో ఖో కోర్టులు కావాలని విద్యార్థులు కలెక్టర్ ను కోరగా, తగు చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. తహసిల్దార్ రమేష్, టిఈడబ్ల్యూఐడిసి డిఈ అశోక్, జి ఈ సి ఓ ఫ్లోరెన్స్, ఎం ఈ ఓ శ్రీదేవి స్పెషల్ ఆఫీసర్ మేనక, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## చీఫ్ జస్టిస్ పై దాడి చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలి



**వేద న్యూస్, ఇబ్రహీంపట్నం:**

భారత అత్యున్నత న్యాయ స్థానమైన సుప్రీంకోర్టులో చీఫ్ జస్టిస్ బి.ఆర్. గవాయి పై బూటు విసిరి దాడికి పాల్పడ్డ అడ్వకేట్ రాకేష్ కిషోర్ ని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలో తహసీల్దార్ కార్యాలయం ముందు ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చెట్టుపెల్లి లక్ష్మణ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కు వినతిపత్రం సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బి. ఆర్. గవాయి దళితుడు కావడం వల్లనే ఈ దాడి జరిగిందని అన్నారు.గవాయ్ స్థానంలో అగ్రకులాలకు చెందిన జడ్జి ఉంటే ఈ దాడి జరిగి ఉండేది కాదని అన్నారు. గవాయిపై జరిగిన దాడితో దళితుల ఆత్మగౌరవం ప్రమాదంలో పడింది అని అన్నారు. దళితులు ఉన్నత స్థానంలో ఉండడాన్ని ఉన్నత వర్గాలకు చెందిన శక్తులు జీర్ణించు కోలేకపోతున్నాయని, ఈ సంఘటన జరిగి పది రోజులు గడుస్తున్న ఇప్పటికీ నేరస్తుడి మీద కేసులు పెట్టకపోవడం, అరెస్ట్ చేయకపోవడం దుర్మార్గమని అన్నారు.ఎన్నో సంఘటనల మీద కేసులు సుమోటోగా తీసుకుంటున్నటువంటి పోలీస్ వ్యవస్థ అలాగే న్యాయవ్యవస్థలు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి మీద దాడి జరిగితే ఎందుకు సుమోటోగా తీసుకోవడం లేదని ప్రశ్నించారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పై జరిగిన దాడిపై కేసు నమోదు చేయకపోతే ఈ దేశంలో సామాన్యుల పరిస్థితి ఏ విధంగా ఉంటుందని ప్రశ్నించారు.ఇకనైనా తక్షణమే దాడి చేసిన నిందితుడిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని, వెంటనే కేసు నమోదు చేయాలని అలాగే ఈ సంఘటన వెనుక ఉన్న శక్తులను గుర్తించడానికి సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి తో కమిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సి.జే. పై దాడి చేయడం అంటే యావత్తు న్యాయ వ్యవస్థ మీద, భారత రాజ్యాంగం మీద ప్రజాస్వామ్య స్ఫూర్తి మీద దాడి చేయడమేనని, ఇలాంటివి ఈ వ్యవస్థకు అత్యంత ప్రమాదకర మైనదని మండిపడ్డారు.రాజ్యాంగ విలువల పట్ల లోతైన అవగాహన, సామాజిక న్యాయం పట్ల స్పష్టత,

మిగతా 2వ పేజీలో..

## రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు

– తహసీల్దార్ వరప్రసాద్



**వేద న్యూస్, ఇబ్రహీంపట్నం :**

ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ప్రారంభించినట్లు తహసీల్దార్ వర ప్రసాద్ తెలిపారు. ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ వద్ద మక్కలు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వర ప్రసాద్ మాట్లాడుతూ.. ఇబ్రహీంపట్నం ప్రభుత్వం ఏర్పాటు చేసిన మక్క కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు తమ మక్కలను విక్రయించాలని సూచించారు. మొక్కజొన్నకు ప్రభుత్వం రూ. 2400/- మద్ధతు ధర కల్పిస్తుందని, రైతులు ఈ అవకాశన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. రైతులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూసుకోవాలని తహసీల్దార్ వరప్రసాద్ అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరిగాం రాజు, మార్కెట్ వైస్ చైర్మన్ ఎలాల వేంకట్ రెడ్డీ, సింగల్ విండో చైర్మన్ బద్దం గోపి, ఎవో ఆకు రాజ్ కుమార్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు దూదిగాం గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

## ఐకెపిలో జరిగిన అక్రమాల కేసులో ఒకరు అరెస్ట్



**వేద న్యూస్, శాయంపేట:**

ఐకెపి సెంటర్లో జరిగిన అక్రమాల విషయంలో ఒకరు అరెస్టు చేసినట్లు పరకాల ఏసిపి సతీష్ బాబు తెలిపారు.పరకాల ఏ సిపి సతీష్ బాబు తెలిపిన వివరాల ప్రకారం ఈ సంవత్సరం రబీ పంట సీజన్ సమయంలో ఐకెపి సెంటర్ లలో జరిగిన అక్రమాల విషయంలో ఈనెల 11 తేదీన శాయంపేట పోలీస్ స్టేషన్ లో నమోదు అయిన కేసు సిఆర్ నెంబర్ 196/2025 లోనీ నేరస్థులలో ఈ నెల తేది 17న శాయంపేట ఐకెపి సెంటర్ ఇంచార్జి శాయంపేట గ్రామానికి చెందిన బలభద్ర హైమావతి ను అరెస్ట్ చేసి, ఆమె వద్ద నకిలీ ఎంట్రీలు చేయడానికి ఉపయోగించిన ట్యాబ్, వరి ధాన్యం టోకెన్ బుక్ , సెల్ ఫోన్ ను స్వాధీనం చేసుకుని రిమాండ్ కు పంపించినట్లు పరకాల ఏసిపి సతీష్ బాబు తెలిపారు.

## పెట్రోలింగ్ వ్యవస్థను మరింత పటిష్ట పరచాలి

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

సిరిసిల్ల సబ్ డివిజన్ అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఐపిఎస్. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నేర విచారణ మరింత సమర్థవంతంగా చేయడంతో పాటు పెండింగ్లో ఉన్న కేసులపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ వాటిని త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని వాటిని సత్వరం పరిష్కరించే విధంగా పోలీస్ అధికారులంతా పని చేయాలని ఇప్పటివరకు నమోదైన కేసులలో నాన్ గ్రేవ్ కేసులు, గ్రేవ్ కేసుల విషయంలో తీసుకోవలసిన చర్యలు గురించి అధికారులకు వివరించారు. దొంగతనాల నివారణకు రాత్రిపూట పెట్రోలింగ్ వ్యవస్థను, నిఘా వ్యవస్థను పటిష్ట పరచాలి అని తెలిపారు. దొంగతనాల నివారణకు ప్రతి సర్కిల్ పరిధిలో ఒక స్పెషల్ టీం ను నియమించి వాటి నివారణకు కృషి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రతి రోజూ డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్‌లు, వాహన తనిఖీలు నిర్వహించాలని, బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే ప్రాంతాల పై నిఘా ఉంచాలని

మిగతా 4వ పేజీలో..



# సాధారణ ప్రసవానికి ప్రాధాన్యత

- ఆదిత్య మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో..
- సురక్షిత, నాణ్యమైన వైద్య సేవలు
- 24/7 అందుబాటులో స్త్రీల వైద్య నిపుణులు డాక్టర్ గ్రీష్మ ఒగ్గు



**వేద న్యూస్, జమ్మికుంట:**

ధనార్జనే ధ్యేయంగా కొందరు వైద్యులు సిజేరియన్లు చేస్తున్న తరుణంలో సాధారణ కాన్పు చేసేందుకు ప్రాధాన్యతనిస్తున్న కొద్ది మంది వైద్యులలో ఒకరు ఆదిత్య మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యురాలు డాక్టర్ గ్రీష్మ ఒగ్గు అని చెప్పొచ్చు. జమ్మికుంట పట్టణంలోని సదరు హాస్పిటల్‌లో ఆమె స్త్రీల వైద్య నిపుణురాలిగా చక్కటి సేవలను అందిస్తున్నారు. నార్మల్ డెలివరీ తమ మొదటి ప్రాధాన్యత అని సదరు ఆస్పత్రి వారు పేర్కొంటుండటం విశేషం. నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో అతి తక్కువ ఖర్చుతో సురక్షితమైన, నాణ్యమైన సేవలు అందిస్తున్నట్టు ఆస్పత్రి నిర్వాహకులు వెల్లడించారు. సదరు హాస్పిటల్‌లో పిల్లలు లేని దంపతుల కోసం ప్రత్యేక ఇన్ఫర్టిలిటీ వైద్య సదుపాయం కూడా ఉంది. స్త్రీల వైద్య నిపుణులు డాక్టర్ గ్రీష్మ ఒగ్గు ఎంబీబీఎస్ ఎంఎస్ ఓబీగైనకాలజీ స్త్రీలకు సంబంధించిన సమస్యలపై చక్కటి వైద్య సేవలందిస్తున్నారని పలువురు పేర్కొన్నారు.

# బీసీ బంద్ సక్సెస్ చేయండి

## - బీసీ సంఘాలకు బీజేపీ యువనేత లడే శివ పిలుపు

**వేద న్యూస్, వరంగల్:**

శనివారం జరగబోయే బీసీ బంద్‌కు శాయంపేట మండలంలోని అన్ని బీసీ సంఘాలు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని బీజేపీ యువనేత లడే శివ పిలుపునిచ్చారు. బీసీ హక్కుల కోసం జరిగే ఈ బంద్‌ను భారీ స్థాయిలో నిర్వహించాలని, బీసీల ఏకతాటిపై నిలబడి తమ శక్తిని చూపించాలని ఆయన కోరారు. శాయంపేట మండలంలోని 24 గ్రామాలలో ఉన్న బీసీ సంఘాలు అంతా రోడ్డెక్కి, "42% రిజర్వేషన్ సాధించేవరకు బీసీలు తగ్గేది లేదు" అనే నినాదంతో బంద్ విజయవంతం చేయాలని లడే శివ ఆకాంక్షించారు. బీసీల సామాజిక, ఆర్థిక పురోగతికి రిజర్వేషన్లు ఎంతగానో అవసరమని, ఈ ఉద్యమం ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి న్యాయమైన హక్కులను సాధించాల్సిన అవసరం ఉందని ఆయన హితవు పలికారు. బీసీ బంధు కార్యక్రమానికి అన్ని బీసీ సంఘాలు, యువత, పెద్దలు మద్దతు తెలిపి ఐక్యతను చాటాలని లడే శివ కోరారు.



# బంద్ ఫర్ జస్టిస్ కు తరలి రండి

## - బంద్ ను విజయవంతం చేద్దాం - వీరస్వామిగౌడ్ పిలుపు

**వేద న్యూస్, జమ్మికుంట:**

బీసీ కుల సంఘాలు ఒక్కటై బీసీలకు జరుగుతున్న అన్యాయంపై.. ముఖ్య%శీ%గా 42 శాతం రిజర్వేషన్ల అమలుపై హైకోర్టు సుప్రీంకోర్టు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మీద ఒత్తిడి తీసుకు రావటానికి.. జరపనున్న బంద్‌కు అన్ని రాజకీయ పార్టీల మద్దతు ఇస్తున్నాయని, ఈ నెల 18వ తేదీన బీసీ జే ఏసీ చైర్మన్ ఆర్.కృష్ణయ్య, వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ ,వైస్ చైర్మన్ వి.జి.ఆర్ నారగొని కో చైర్మన్ దాసు సురేష్ ల పిలుపు మేరకు బంద్ ను విజయవంతం చేయాలని వీరస్వామిగౌడ్ కోరారు. కాంగ్రెస్ , బీజేపీ, బీఆర్ఎస్, సీపీఐ ,సిపియం, బీస్పీ ప్రజా సంఘాలు అంబేత్కర్ సంఘాలు, ఎమ్మార్పీఎస్ ఉద్యోగ సంఘాలు మద్దతు ఇస్తున్నాయని చెప్పారు. బీసీలకు జనాభా ప్రకారం రావాల్సిన వాటకోసం కామారెడ్డి డిక్లరేషన్ లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్లు ఇస్తే.. కొందరు రెడ్డి జాగృతి పేరుతో కోర్టుల్లో పిటిషన్లు వేసి అడ్డుకోవడం జరిగిందనీ వెల్లడించారు. దానికి నిరసనగా 18 వ తేదీ ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు 12 గంటల రాష్ట వ్యాప్తంగా బంద్ కు పిలుపు నివ్వటం జరిగిందనీ తెలిపారు. ఈ బంద్ కు ఆర్టీసీ డ్రైవర్స్ అసోషియేషన్స్, పెట్రోల్ బంకులు, వీధివ్యాపారులు బ్యాంకులు ,ప్రతి ఒక్కరు సహకరించి ..స్వచ్ఛందంగా బంద్ పాటించాలని పిలుపునిస్తున్నా మనీ చెప్పారు. అలాగే ప్రభుత్వ ఉద్యోగులు కూడా నల్ల బ్యాడ్జీలతో వారి నిరసన తెలియ జేయాల్సిందిగా కోరారు. అలాగే ప్రభుత్వ ప్రైవేట్ విద్య సంస్థలు కూడా సహకరించాల్సిందిగా యాజమాన్యాలకు.. విద్యార్థుల తల్లి దండ్రులు విద్యార్థులను స్కూల్స్ కాలేజీలకు పంపకుడా సహకరించాల్సిందిగా.. అలాగే వాహన దారులు ముఖ్య%శీ%గా డ్రైవర్స్ అసోషియేషన్స్ సహకరించాల్సిందిగా కోరారు. 18 తేదీ బంద్ రోజున బీసీసంఘాలు కులసంఘాలు ఉద్యోగ సంఘాలు అందరు రోడ్ల మీదికి వచ్చి శాంతి యుతంగా నిరసన తెలపాల్సిందిగా.. రాష్టం లోని ఆయా ప్రాంతాల్లో రాజకీయ పార్టీల ప్రజా సంఘాల మద్దతు తీసుకొని సమిష్టి బాధ్యతగా కలిసి స్వచ్ఛందంగా బంద్ లో పాల్గొనాల్సిందిగా బీసీ జే ఏసీ రాష్ట్ర కన్వీనర్, సర్వాయి పాపన్న మో కు దెబ్బ గౌడ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు వీరస్వామి గౌడ్ కోరారు.



# సిపిఆర్ పై అవగాహన అవసరం

**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**



"సి.పి.ఆర్ (హృదయ-శ్వాస పునరుద్ధరణ) పై ప్రజల్లో అవగాహన పెంపొందితే, గుండ పోటు వంటి అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను రక్షించడం సాధ్యమవుతుందని కేయూ వైస్ చాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి తెలిపారు. విశ్వవిద్యాలయ ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మెంబెర్ ఇన్‌చార్జ్ ఆచార్య ఎన్. ప్రసాద్ సమన్వయంతో విశ్వవిద్యాలయ సెనెట్ హాల్లో శుక్రవారం మధ్యాహ్నం సి.పి.ఆర్ పై అవగాహన కార్యక్రమం జరిగింది. ప్రముఖ హృద్రోగ నిపుణులు డాక్టర్ ఆర్. శ్రీనివాస్ మాట్లాడుతూ, "సి.పి.ఆర్ ద్వారా జీవన ప్రమాణం పెరుగుతుంది. శాస్త్రీయంగా నిరూపితమైన పద్ధతి. అత్యవసర సేవలు చేరుకునేలోపు సి.పి.ఆర్ చేయడం ద్వారా ప్రాణాలు కాపాడవచ్చున్నారు. అలాగే, ప్రజా ఆరోగ్య పరంగా ప్రతి ఒక్కరికి సి.పి.ఆర్ పై ప్రాథమిక అవగాహన ఉండాలని సూచించారు. అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే భారతదేశంలో అత్యవసర సహాయం చేరడంలో ఆలస్యం జరుగుతోందని, అటువంటి పరిస్థితుల్లో తక్షణ సి.పి.ఆర్ చర్యలు కీలకమని ఆయన పేర్కొన్నారు. "గుండెపోటు లేదా ఇతర అత్యవసర పరిస్థితుల్లో రోగి స్పందన, కదలిక ఆధారంగా వెంటనే సి.పి.ఆర్ ప్రారంభించాలి. అనంతరం 108 కి కాల్ చేసి, అవసరమైతే షాక్ (డిఫిబ్రిలేటర్) ఇవ్వాలి, అంబులెన్స్ సాయాన్ని వెంటనే పొందాలని డాక్టర్ శ్రీనివాస్ వివరించారు. తరువాత విద్యార్థులు, ఉద్యోగులు సి.పి.ఆర్ పరికరంపై ప్రాక్టీస్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బోధన బోధన ఇతర పరిశోధక విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డా. ఆర్. శ్రీనివాస్‌ను సన్మానించారు.

# మానసిక ఆరోగ్యంపై విద్యార్థులకు అవగాహన



**వేద న్యూస్, శాయంపేట :**

కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం శాయంపేటలో డాక్టర్ ప్రహసిత్ మానసిక ఆరోగ్యం పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ ప్రహసిత్ మాట్లాడుతూ మానసిక సమస్యలు, జ్ఞాపకశక్తి లోపం ,పరీక్షల భయం, ఆత్మహత్య ఆలోచనలు, ఒత్తిడి, ఆందోళన ,అతిగా ఆలోచించడం వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి వారు వివరించారు .అలాగే విద్యార్థులకు గోల్ సెట్టింగ్, టైం మేనేజ్మెంట్లను పై మన కూడా చాలా చక్కగ వివరించారు. టెలి మానస్ 14416 కు కాల్ చేసి మీ సమస్యలను పరిష్కరించుకోవచ్చు అని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ ఎం.మాధవి ఉపాధ్యాయినిలు , విద్యార్థినిలు, పీఎచ్ సీ శాయంపేట హెల్త్ సూపర్వైజర్ మల్లేశం, సిహెచ్ఓ విజయ ,ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# సిటీ కాలేజీలో "క్యాంపస్ ఈకో బజార్"

**వేద న్యూస్, హైదరాబాద్ :**

"పండుగలను బాధ్యతాయుతంగా, పర్యావరణ హితంగా జరుపుకోవడం అంటే మన సంస్కృతిని కాపాడటమే కాకుండా మన గ్రహాన్ని కూడా రక్షించడమే," అని గవర్నమెంట్ సిటీ కాలేజి ప్రిన్సిపాల్ ప్రొ.కె.పద్మావతి అన్నారు. ఆమె కాలేజీలో నిర్వహించిన "స్వదేశీ దీపావళి కోసం క్యాంపస్ ఈకో బజార్" కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమం తెలంగాణ నేషనల్ గ్రీన్ కార్ప్స్ మరియు పర్యావరణ, అరణ్యాలు మరియు వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించడం, పర్యావరణ చైతన్యాన్ని పెంపొందించడం లక్ష్యంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా ప్రొ. కె. పద్మావతి విద్యార్థులను ప్రోత్సహిస్తూ ఇలాంటి కార్యక్రమాలు పర్యావరణ అవగాహనతో పాటు విద్యార్థుల్లో మార్కెటింగ్, నాయకత్వ నైపుణ్యాలను పెంపొందిస్తాయని అన్నారు. కాలేజీ ఈకో క్లబ్ సమన్వయంతో నిర్వహించిన ఈ బజార్‌లో గవర్నమెంట్ సిటీ కాలేజీ, సమీప కాలేజీల విద్యార్థి బృందాలు ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లు ఆకర్షణగా నిలిచాయి. వీటిలో మట్టి దీపాలు, పర్యావరణహిత పూజా సామగ్రి, సంప్రదాయ పండుగ వంటకాలు, స్వీట్లు వంటి దేశీయ ఉత్పత్తులు చవక ధరలకు విక్రయించారు విద్యార్థులు. ఈ కార్యక్రమానికి ఈకో క్లబ్ కన్వీనర్ డా.టి.రాగ సుధ, టిఎన్ జిసి కో ఆర్డినేటర్ డా.డి.నాగరాజు, సభ్యులు పి. రత్న కుమార్, డా. కె. ఆనంద్, సుమన యాదగిరి, డా. తిరుపతి, డి. శ్రవణ్ కుమార్ విద్యార్థులకు తగిన సలహాలు, సూచనలు అందించారు. కార్యక్రమానికి వైస్ ప్రిన్సిపల్స్ డా.విప్లవ్ దత్ శుక్లా, డా.పి.శాంతి, ఐక్యూయేసి కోఆర్డినేటర్ డా.జె.నీరజ, శ్రీమతి మాధవి, అధ్యాపకులు, విద్యార్థులు హాజరయ్యారు. విద్యార్థులు తయారుచేసిన రుచికరమైన పండుగ వంటకాలు, స్వీట్లు వెంటనే అమ్ముడవడం విశేషం. ఉత్తమ స్టాళ్లు, రుచికరమైన వంటకాలను గుర్తించి ఈకో క్లబ్ ఆయా విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లను ప్రకటించింది. ఈకో బజార్ నిర్వహణ ద్వారా విద్యార్థులు ఈ దీపావళిని నిజమైన స్వదేశీ, పర్యావరణహిత పండుగగా మార్చే స్ఫూర్తిని పొందారు.



# చీఫ్ జస్టిస్ పై దాడి చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలి

ఎన్నో చారిత్రాత్మకమైన తీర్పులు వెల్లడించిన జ్ఞాన సంపన్నుడిగా పేరుగాంచిన, రాజ్యాంగమే ప్రామాణికంగా భావించే న్యాయ కోవిదుడిపై దాడికి దిగడం అనాగరికమైన చర్య అని, ఈ దాడికి పాల్పడ్డ నిందితుని అరెస్ట్ చేసేంతవరకు, దళితులకు రక్షణ కల్పించేంతవరకు ఈ పోరాటం ఆగదని అన్నారు. మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు అక్టోబర్ 27,న లక్షలాది మందితో హైదరాబాదులో దళితుల ఆత్మగౌరవ ప్రదర్శనను నిర్వహించి తీరుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ వికలాంగులు గట్ల సాయి ప్రసాద్, మంగ సాయి నిఖిల్, లక్ష్మి అనురాధ గంగు మల్లయ్య రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# క్రీడాకారులను అభినందించిన మోడల్ స్కూల్ ప్రిన్సిపల్

**వేద న్యూస్, కమలాపూర్ :**

హనుమకొండ జిల్లా కమలాపూర్ తెలంగాణ మోడల్ స్కూల్ కి చెందిన విద్యార్థులు గత నెలలో హనుమకొండ జిల్లా కేంద్రంలో నిర్వహించిన 69వ ఎస్ జి ఎఫ్ ఐ క్రీడలలో అండర్ - 19 విభాగంలో నిఖిల్, అండర్ - 17 విభాగంలో సుశాంత్ లు ఉత్తమ ప్రతిభ కనబరచడమే కాకుండా మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో కూడా పాల్గొని కాంస్య పథకాలు సాధించారు. అంతేకాకుండా ఏడవ తెలంగాణ స్టేట్ జూనియర్ నెట్ బాల్ ఛాంపియన్ షిప్ జిల్లాస్థాయి పోటీలు హనుమకొండలో జరగగా ప్రవళిక, రుచితలు బాగా రాణించి జిల్లా స్థాయిలో ఎంపికై మహబూబ్ నగర్ జిల్లా డీఎస్ఏ స్టేడియంలో నిర్వహించిన పోటీలలో కూడా పాల్గొన్నారు. అదేవిధంగా అండర్ 17 వాలీబాల్ క్రీడలలో శ్రీమాన్, శ్రీ హర్ష లు జిల్లా స్థాయిలో అత్యుత్తమమైన ఆట తీరును ప్రదర్శించారు. క్రీడల్లో తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు రాణించడం పట్ల పాఠశాల ప్రిన్సిపల్ డా. అనిత సంతృప్తి వ్యక్తం చేసి విద్యార్థులను అభినందించడం తో పాటుగా విద్యార్థులను క్రీడల్లో రాణించే విధంగా తీర్చిదిద్దుతున్న వ్యాయామ ఉపాధ్యాయుడు రాజును ప్రత్యేకంగా అభినందించారు.




# నిస్వార్థ సేవను ఎన్.ఎస్.ఎస్ ప్రోత్సహిస్తుంది

**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**




కాకతీయ విశ్వవిద్యాలయ జాతీయ సేవా పథకం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ ఆచార్య ఈసం నారాయణ అధ్యక్షతన శుక్రవారం ఉదయం విశ్వవిద్యాలయ సెనేట్ హాల్లో జరిగిన ఉమ్మడి వరంగల్ జిల్లా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ల సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కేయూ వైస్ చాన్స్‌లర్ ఆచార్య కే. ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ, “విద్యార్థుల వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దడంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ల పాత్ర అత్యంత కీలకమైందని, భారతీయ జ్ఞాన వ్యవస్థ ఏకీకరణలో ఎన్.ఎస్.ఎస్ అధికారుల పాత్ర ప్రాముఖ్యత సంతరించుకుందని, కొత్త విద్యా విధానం (ఎన్ఈపి) ఆదిశగా ముందుకు సాగుతోందని తెలిపారు. విద్యార్థులు పాఠ్యేతర కార్యక్రమాలపై కూడా దృష్టి సారించి, నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసం, నైతిక విలువలను పెంపొందించుకోవాలని సూచించారు. నూతన ప్రోగ్రామ్ ఆఫీసర్లకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరమున్నదని తెలిపారు. గౌరవ అతిథిగా హాజరైన విశ్వవిద్యాలయ విద్యార్థుల డీన్ ఆచార్య మామిడాల ఇస్తారి మాట్లాడుతూ విద్యార్థులను దేశ భవిష్యత్ నిర్మాణ దిశగా తీసుకువెళ్లడంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ల పాత్ర కీలకమని పేర్కొన్నారు. గ్రామీణ సమస్యలపై అధ్యయనం జరగాలని, త్యాగధనుల స్ఫూర్తిని కొనసాగించాలని, దేశ సేవకు సిద్ధమైన యువతను తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. మై భారత్ పోర్టల్ డిప్యూటీ డైరెక్టర్ చింతల అన్వేశ్ మాట్లాడుతూ, “జాతీయ సేవా పథకం కార్యక్రమాలు అభినందనీయమైనవి, వికసిత్ భారత్ లక్ష్య సాధనలో భాగంగా యూత్ పార్లమెంట్, యూత్ ఫెస్టివల్, యువ ఆపద మిత్ర వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు, వీటిలో ఎన్ఎస్ఎస్ యూనిట్లు సంయుక్తంగా పాల్గొనాలని సూచించారు. సభాధ్యక్షుడు ఆచార్య ఈసం నారాయణ మాట్లాడుతూ, కాకతీయ విశ్వవిద్యాలయ పరిధిలో ప్రస్తుతం 356 ఎన్ఎస్ఎస్ యూనిట్లు ఉన్నాయని, ప్రతి సంవత్సరం సమాజహిత కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. వాలంటీర్లు అందరూ మై భారత్ పోర్టల్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. వికసిత్ భారత్ బ్యానర్ కింద యూత్ పార్లమెంట్ నిర్వహణకు హనుమకొండ జిల్లాలోని వర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలకు అవకాశం లభించిందని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో డా. టి. రాధిక, డా. రామ్ బాబు, డా. జంబు, డా. అనిల్, డా. ప్రసన్న కుమార్ డా. రఘువేందర్ రెడ్డి, యూ . శ్రీనివాస్, ఈ రాజేశ్వర్, ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు కళాశాలల ప్రోగ్రామ్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

# ‘లోన్’..@ లైఫ్ గాన్!



పెంచవచ్చు, ఇది ఇతర కస్టమర్లకు భారంగా మారుతుంది.

**– అత్యవసరాలకు మాత్రమే ప్రాధాన్యత**

మీ జీవితాన్ని ఈ ఉచ్చు నుండి రక్షించుకోవడానికి కొన్ని సామాన్య జ్ఞాన సూత్రాలు పాటించండి. విద్య, ఆరోగ్యం, ఇంటి నిర్మాణం వంటి అత్యవసర అవసరాల కోసం మాత్రమే లోన్ తీసుకోండి. లగ్జరీ జీవనశ్కైలి కోసం లోన్‌లు తీసుకోవడం మానండి. లోన్ తీసుకునే ముందు మీ ఆదాయం, ఖర్చులు, ఈఎంఐ చెల్లింపు సామర్థ్యాన్ని అంచనా వేయండి. ఈఎంఐ మీ నెలవారీ ఆదాయంలో 30-40 శాతం కంటే ఎక్కువ ఉండకూడదు. లోన్ ఒప్పందంలోని వడ్డీ రేట్లు, రీపేమెంట్ వ్యవధి, పెనాల్టీలు, ఇతర షరతులను జాగ్రత్తగా చదవండి. ప్రతి నెల ఈఎంఐని కచ్చితంగా చెల్లించండిఇది వడ్డీ భారాన్ని తగ్గిస్తుంది, క్రెడిట్ స్కోర్‌ను మెరుగుపరుస్తుంది. ఆర్థిక సాక్షరతా కార్యక్రమాలలో పాల్గొనండి, లోన్‌ల గురించి సమాచారం సేకరించండి. లోన్‌లు మీ ఆర్థిక అవసరాలను తీర్చడానికి సహాయపడతాయి, కానీ నిర్లక్ష్యం వల్ల అవి మీ జీవితాన్ని నాశనం చేయవచ్చు. జాగ్రత్తగా ఆలోచించండి, సకాలంలో చెల్లించండి, ఆర్థిక స్వేచ్ఛతో గౌరవంతో జీవించండి! అవసరం అయితేనే లోన్ తీసుకోండి! ప్రతి నెల కచ్చితంగా ఈఎంఐ కట్టండి! ఆర్థిక ఉచ్చు నుండి బయటపడండి, గౌరవంతో జీవించండి!..ఈ మేరకు కొందరు నిపుణులు సూచిస్తున్నారు.

# శాంతియుత బందును విజయవంతం చేయాలి

**వేద న్యూస్,బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం రాష్ట్రం లో 42 శాతం బిసి రిజర్వేషన్ కు కోర్టు స్టే విధించినందుకు రిజర్వేషన్ అమలు కోసం జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య, రాష్ట్ర అధ్యక్షులు గవ్వల భరత్,బిసి సంఘాల జెఏసి ఆధ్వర్యంలో బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పించిన జీవోపై అగ్రవర్ణాల కుట్రల కారణంగా హైకోర్టు స్టే విధించిందని దానికి నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 18 వ తేది శనివారం రోజు బందుకు పిలుపునిచ్చారు. ఈ బంధు కార్యక్రమాన్ని జాతీయ యువజన సంఘం రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్చార్జ్ దండు వినోద్, ఆధ్వర్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా శనివారం రోజు శాంతియుత బందు నిర్వహించబడుతుందని దీనిలో భాగంగా బోయినిపల్లి మండలం లో కూడా బంధు కార్యక్రమాన్ని నిర్వహించబడుతుందని ఇట్టి బంధుకు వ్యాపారవేత్తలు, విద్యాసంస్థలు అన్ని బీసీ సంఘాలు, ప్రజలు అందరూ తమ సంపూర్ణ, స్వచ్ఛంద సహకారం అందించాలని జాతీయ బిసి యువజన సంఘం బోయినిపల్లి మండల అధ్యక్షులు, సంబు మహేష్, గౌరవ అధ్యక్షులు ఏనుగుల అనిల్, ఉపాధ్యక్షులు వెంకట సాయి, ప్రధాన కార్యదర్శి ముదాం శ్రీనివాస్, కార్యదర్శి పెరుక మహేష్, జాయింట్ సెక్రెటరీ నేలపల్లి రాజేందర్,కోశాధికారి పబ్బల్ల అనిల్, కార్యవర్గ సభ్యులు గుంటి శేఖర్,హరికృష్ణ,లు కోరారు.



# పరికరములు అందజేత

**వేద న్యూస్,బోయినిపల్లి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం వ్యవసాయ మార్కెట్ కమిటి బోయినిపల్లి మండల పరిధిలోని మార్కెటింగ్ సీజన్ వానాకాలం 2025-26 సంవత్సరంలో నిర్వహించే వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణకు అవసరమైన యం.ఎస్.పి పరికరములు అనగా టార్పాలిన్స్, మాయిశ్చర్ మీటర్లు, ఎలక్ట్రానిక్ కాంటాలు,అలాగే ప్యాడి క్లీనర్లు, రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్, రైతుల ఉపయోగార్థము ఇచ్చిన ఆదేశాల ప్రకారం ఐ.కే.పి అలాగే పి.ఏ.సి.ఎస్ వారికి యం.ఎస్.పి పరికరములు జారీ చేయడం జరిగింది. కావున రైతులందరు మీ యొక్క ధాన్యాన్ని కోనుగోలు కేంద్రాల ద్వారా అమ్ముకొని మద్దతు ధర పొందగలరు. ఇట్టి కొనుగోలు కేంద్రాలకు ఇచ్చిన యం.ఎస్.పి పరికరములను రైతులు సద్వినియోగపరుచుకోగలరని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్ రైతులకు తెలియజేయడం జరిగింది.

# మంత్రుల చిత్రపటాలకు పాలాభిషేకం

**వేద న్యూస్,బోయినిపల్లి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రంలో పలువురు నాయకులు టపాసులు పేల్చి సీఎం , మంత్రులు, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం,ల చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సంద ర్భంగా నాయకులు ఏనుగుల కనక య్య, మాట్లాడుతూ రాజకీయ అనుభ వం ఉండి ప్రజాసేవలో ముందుకు నడవాలనుకునే నాయకులకు ముగ్గురు సంతానం ఉన్న కారణంగా గత ప్రభుత్వాలు పోటీ చేయకుండా చేయడం తో ఎంతో నిరుత్సహానికి గురయ్యారని. గురువారం అసెంబ్లీలో ముగ్గురు సంతానం ఉన్న వారిని సైతం పోటీ చేయడానికి అర్హులుగా ప్రకటించి నందుకు, ధన్యవాదాలు తెలుపుతూ సంబరాలు చేసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వన్నెల రమణారెడ్డి,ఏనుగుల కనకయ్య, బీసీ ఎస్సీ ఎస్టీ గ్రామ జేఏసీ చైర్మన్ మాడిశెట్టి గంగయ్య,కొప్పుల బుచ్చి రాములు, మాడిశెట్టి జనార్ధన్,నల్ల మోహన్, తదితరులు ఉన్నారు.

# బిసి జేఏసీ బందుకు బిజెపి సంపూర్ణ మద్దతు

**వేద న్యూస్,శాయంపేట:**

18 వ తేదీన బిసి జెసి ఆధ్వర్యంలో నిర్వహించే తెలంగాణ బందుకు బిజెపి సంపూర్ణ మద్దతు తెలుపుతూ బిజెపి మండల అధ్యక్షుడు నరహరిశెట్టి రామకృష్ణ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో వెనుకబడిన వర్గాల ఐక్య కార్యాచరణ సమితి ఏర్పాటు దిశగా అడుగులు పడుతున్నాయి. రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ల అంశం లో నెలకొన్న తాజా పరిస్థితిలో బీసీ ప్రజాప్రతినిధులు, బీసీ కుల సంఘాలు ,మేధావుల నుంచి డిమాండ్ వినిపిస్తుంది. రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవో పై హైకోర్టు స్టే ఇవ్వడం స్థానిక సంస్థల ఎన్నికలలో నోటీసుకేషన్ లాంటి పరిణామాలు బీసీలు జీర్ణించుకోలేకపోతున్నారు.రేపు బీసీ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించే బందుకు అన్ని వర్గాల ప్రజలు, పాఠశాలలు, కాలేజీలు పెట్రోల్ బంకులు, ఇతర వాణిజ్య వ్యాపార సముదా యాల ప్రజలు అందరూ స్వచ్ఛందంగా పాల్గొని రేపటి బందును విజయవంతం చేయాల్సిందిగా వారు కోరారు.



# రాష్ట్ర వ్యాప్తంగా విస్తరిస్తున్న మెపా

## – మెపా జనగాం జిల్లా కమిటి ఎన్నిక

**వేద న్యూస్, జనగామ:**

మెపా (ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ తెలంగాణ) ఆశయ సాధన లో విద్య ఉద్యోగ సాధికారత కోసం నిత్యం ముదిరాజ్ జాతి ప్రయోజనాల కోసం కృషి చేస్తుందని ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా విస్తరించే క్రమంలో జనగామ జిల్లా కమిటీని ఎన్నుకున్నట్లు ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (మెపా )రాష్ట్ర కార్యదర్శి నీరటి రాజు ముదిరాజ్ తెలిపారు. శుక్రవారం జనగామ జిల్లా కేంద్రంలో దండు నర్సింహులు ముదిరాజ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో జనగామ జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నిక కార్యక్రమానికి ఎన్నికల పరిశీలకులుగా హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షులు గోనెల విజేందర్ ముదిరాజ్ వ్యవహరించారు. రాష్ట్ర కార్యదర్శి నీరటి రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎన్నికలో జనగామ జిల్లా అధ్యక్షుడిగా దండు నర్సింహులు ముదిరాజ్, ప్రధాన కార్యదర్శిగా నీల గోపాల్ ముదిరాజ్, ఉపాధ్యక్షులు గా కాగితాల మల్లికార్జున్, జనిగల సత్యనారాయణ, దండు రాజు,దాసరి రామ్ నర్సయ్య ముదిరాజ్, గౌరవ అధ్యక్షులు జడల శ్రవణ్ కుమార్ ముదిరాజ్, కార్యదర్శులుగా కుక్కల ఎల్లేష్,ఈర్ల వెంకటేష్ ముదిరాజ్, కార్యవర్గ సభ్యులుగా కుక్కల ఎల్లేష్,ఈర్ల వెంకటేష్ ముదిరాజ్‌లు ఎన్నికయ్యారు. ఈకార్యక్రమంలో రాజు,రమేష్,రాకేష్, రాజశేఖర్, కిట్టు, సోమయ్య, నర్సయ్య ముదిరాజ్ లు పాల్గొన్నారు.




మెపా జనగామ జిల్లా అధ్యక్షులు దండు నర్సింహులు ముదిరాజ్




మెపా జనగామ జిల్లా ప్రధాన కార్యదర్శి నీల గోపాల్ ముదిరాజ్

# రసమయి దిష్టి బొమ్మ దగ్ధం




**వేద న్యూస్, ఇల్లంతకుంట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల కేంద్రంలోమాజీ శాసనసభ్యులు రసమయి బాలకిషన్ దిష్టి బొమ్మను మండల కాంగ్రెస్ నాయకులు ఆధ్వర్యంలో దహనం చేశారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ మానకొండూర్ నియోజకవర్గ మాజీ అధ్యక్షులు అంతగిరి వినయ్ కుమార్ మాట్లాడుతూ మానకొండూర్ నియోజ కవర్గ శాసనసభ్యులు ప్రియతమ నాయ కులు డా. కవ్వంపల్లి సత్యనారాయణ పై ఆయన కుటుంబ సభ్యులపై మాజీ శాసనసభ్యులు రసమయి బాలకిషన్ అభ్యంతరకరమైన, దురుసుగా మాట్లాడిన తీరును సభ్య సమాజం ఖండిస్తుందని ఇలాంటి మాటలు ఇంకోసారి గనుక మాట్లాడితే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణకి వెంటనే బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ మచ్చ రాజేశం, మాజీ ఎంపీటీసీ సభ్యులు కరుణాకర్ రెడ్డి, మైనార్టీ సెల్ అధ్యక్షుడు జమల్, ఎస్ సి సెల్ జిల్లా నాయకులు జుట్టు నగేష్, ఫిషరీస్ చైర్మన్ జెట్టి మల్లేష్, సాయి వర్మ, మల్లయ్య, బడుగు లింగం,బంగారి ఆంజినేయులు,లక్ష్మన్, రవి, దయసాగర్, బాబు, చిక్కుడు సత్యం, రమేష్, శ్రీకాంత్, నర్సయ్య,దకాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వేద న్యూస్

శనివారం అక్టోబర్ 18, 2025

# సంపాదకీయం

## పోస్టర్లలో ఉద్యోగాలు, జీవితాల్లో నిరీక్షణలు

**- హామీల హంగామా.. వాస్తవ నిరుద్యోగం**
**- యువతలో నిరుద్యోగం.. ప్రభుత్వ హామీలు మరియు వాస్తవ పరిస్థితి**

యువ జనాభా ఏ దేశానికైనా బలమే. కానీ అదే యువత నిరాశ, నిరుద్యోగం అనే భారాన్ని మోసుకుంటే ఆ దేశ భవిష్యత్తు దిశ తప్పడం సహజం. భారత్ వంటి పెద్ద జనసాంద్రత గల దేశంలో ప్రతి ఐదుగురిలో ఒకరు యువకుడిగా ఉంటే, ఈ పెరుగుతున్న శాతం ఉపాధి లేక వీధుల్లో తిరగాల్సిన పరిస్థితి వస్తే అది సామాజిక, ఆర్థిక సంక్షోభానికి నాంది అవుతుంది. ఎన్నికల సమయంలో ప్రభుత్వాలు లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీలు ఇస్తాయి, కానీ వాస్తవానికి ఉద్యోగావకాశాల పట్టికలో అంకెలు పెరగడం కంటే యువత నిరీక్షణలో గడిపే రోజులు మాత్రమే పెరుగుతున్నాయి.

ప్రభుత్వ నియామక ప్రకటనలు వస్తాయి కానీ పరీక్షల నుంచి ఫలితాల వరకూ ప్రక్రియ సంవత్సరాల పాటు లాగిపడుతుంటుంది. పరీక్షలు రుసుము మాత్రం సమయానికి వసూల్ చేస్తారు. ఉద్యోగం ఎప్పుడొస్తుందో అనిశ్చితి ఉండగా, కోచింగ్ సెంటర్లకు వేల రూపాయలు చెల్లించాల్సిన పరిస్థితి యువతను ఋణబంధంలోకి నెట్టేస్తోంది. రిక్రూట్‌మెంట్ ప్రక్రియ పూర్తయినా కోర్టు కేసులు, రూల్ మార్పులు, కోటా సవరణలు అంటూ నియామక ఫైళ్లను ఆఫీసుల టేబుళ్లపై ఆపేస్తున్నారు. కాలేజీల్లో డిగ్రీలు పూర్తి అవుతున్నాయి కానీ నియామక సంస్థల తలుపులు మాత్రం మూసుకుపోతున్నాయి. ఐటీ రంగం, స్టార్టప్ సంస్కృతి, ఆన్‌లైన్ ఫ్రీలాన్స్ అనే కొత్త పరిచయాలు వచ్చినా, ఇవన్నీ అందరికీ అందుబాటులో లేవు. గ్రామీణ యువతకు ఇవి కలల ప్రపంచం లాంటివి. వారి వద్ద స్కిల్స్ ఉన్నా, ఆ స్కిల్స్‌ను మార్కెట్‌కు కలిపే వ్యవస్థ లేదు. అటు ప్రైవేటు రంగంలో తక్కువ జీతాలు, కాంట్రాక్ట్ పద్ధతులు, ఉద్యోగ భద్రత లేకపోవడం వల్ల నిరుద్యోగం ఉన్న వారితో పాటు తక్కువ వేతనంతో బతుకుతున్న 'అసంతృప్త ఉద్యోగులు' అనే కొత్త వర్గం కూడా ఏర్పడింది. ఇలా చూస్తే కేవలం ఉద్యోగం లేని వారు మాత్రమే బాధితులు కాదు, ఉద్యోగం ఉన్నా స్థిర భవిష్యత్తు లేని యువత కూడా ఈ సంక్షోభంలో భాగమే.

సమస్య ఎక్కడుంది? హామీలు ఇవ్వడంలోనా? లేక హామీల రూపకల్పనలోనా? ప్రభుత్వాలు "లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తాం" అని చెప్తే వినడానికి గొప్పగా ఉంటుంది. కానీ అసలు ప్రశ్న "ఆ ఉద్యోగాలు నిజంగా ఉన్నాయా?" అని. ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేటీకరణ దిశగా సాగేలా నిర్ణయాలు తీసుకునేటప్పుడు, అదే సమయంలో ప్రభుత్వ ఉద్యోగాలు పెరుగుతాయని చెప్పడం విరోధాభాసమే. మరోవైపు, "స్వయం ఉపాధి" అనే ఒకే మంత్రాన్ని అందరికీ వర్తించే పరిష్కారంగా చూపించడం కూడా వాస్తవ దూరం.

ఒకవైపు పదే పదే నోటిఫికేషన్‌ల కోసం వెబ్‌సైట్లు రిఫ్రెష్ చేస్తూ కళ్లుచూపులు కోల్పోయే యువత, మరోవైపు సోషల్మీడియాలో "జాబ్ రాకపోతే స్టార్టప్ పెట్టండి" అనే సౌకర్యమైన సలహాలు. స్టార్టప్ పెట్టడానికి బ్యాంకులు సులభంగా రుణాలు ఇవ్వవు, స్కిల్ ట్రైనింగ్ సిస్టమ్ బలంగా లేదు, ఫెయిలైతే మళ్లీ సిస్టమ్‌లోకి వచ్చే మార్గాలు కూడా సరిగా లేవు. అప్పటికి సమయం పోయి ఉంటే, వయస్సు పరిమితి దాటితే ప్రభుత్వ పరీక్షల హాల్‌టికెట్ కూడా అడ్మిట్ చేయదు. ఇన్ని అడ్డంకుల మధ్య యువతలో ఓ ఆంతర్యం పెరుగుతోంది. "మా భవిష్యత్తు ఎక్కడ ఉంది?" అనే ప్రశ్న. ఆ ప్రశ్నకు సమాధానం ప్రస్తుతం ఎవరి చేతిలోనూ స్పష్టంగా కనిపించడం లేదు. ప్రభుత్వాలు ఎన్నికల వేళ హామీలను ప్రచారం పోస్టర్లలో ముద్రించడంలో మాత్రమే చురుకుగా ఉన్నాయి. కానీ ఆ హామీలను వాస్తవ ప్రణాళికలుగా మార్చడం మాత్రం ఇంకా నెమ్మదిగానే సాగుతోంది. నిరుద్యోగం ఒక గణాంకం కాదు, ఓ యువకుడి గుండెల్లో మండే ప్రశ్న. ఆ ప్రశ్నకు సమాధానం కేవలం నోటిఫికేషన్లు జారీ చేయడంలో కాదు, ఆ నోటిఫికేషన్లు ఒక సమయ పరిమితిలో ఫలితాలుగా మారే వ్యవస్థను నిర్మించడంలో ఉంది. ఇంతవరకు జరుగుతున్నది హామీల హంగామా, కానీ యువత కోరుకునేది హామీలలో నిజం. ఈ తరం ఎదుగుదల కోసం, వచ్చే కాలానికి సుస్థిర మార్గం కోసం "పబ్లిసిటీ పాలసీల" కన్నా "ప్లాన్‌డ్ ఎంప్లాయ్‌మెంట్ మెకానిజంల" అవసరం అత్యవసరంగా ఉంది.

- విశ్లేషణ : మునిగాల రాజు పాత్రికేయులు,
డిజైనర్ టెక్ గురు. 8897975262

# పెట్రోలింగ్ వ్యవస్థను మరింత పటిష్ట పరచాలి

వారి పై కేస్ లు నమోదు చేయాలని అన్నారు. ప్రాసిక్యూషన్ లో భాగంగా కోర్టు వారు జారిచేసిన నాన్ బెయిలబుల్ వారెంట్లను నిందితులపై లేదా తప్పించుకుని తిరుగుతున్న నేరస్తులపై అమలుపరచడానికి అధికారులు అందరూ కృషి చేయాలని సూచించారు. స్టేషన్ల పరిధిలోని రౌడీ,హిస్టరీ షీట్స్ ఉన్నవారిపై నిరంతరం పర్యవేక్షణ ఉంచాలని ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తూ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాల, రాష్ట్ర సరిహద్దుల నుండి వచ్చే గంజాయి సరఫరా చేసే మూలాలను, కీలక వ్యక్తులను గుర్తించి వారిపై కేసులు నమోదు చేసి అక్రమ రవాణా పకడ్బందీగా నియంత్రించాలన్నారు.అక్రమ కార్యకలాపాలు అయిన గుట్కా, ఇసుక అక్రమ రవాణా, పేకాట, గుడుంబా,పిడిఎస్ రైస్, వాటి పై నిఘా ఉంచి దాడులు నిర్వహించి అరెస్ట్ చేయాలని సూచించారు.ప్రజల నుండి వచ్చే సమస్యలను తెలుసుకుని ఏ రకంగా పరిష్కరించాలనే విషయంలో గ్రామ పోలీస్ అధికారులు స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని, న్యాయం వైపు పని చేస్తూ బాధితులకు అండగా నిలిచి న్యాయం చేయడం ద్వారా ప్రజలలో పోలీస్ శాఖ పట్ల మరింత నమ్మకం, గౌరవం పెంపొందించేలా పని చేయాలన్నారు.వి పి ఓ లు ప్రతి గ్రామని సందర్శించి గ్రామస్థులతో సమావేశాలు నిర్వహించి యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా మంచి మార్గంలో నడిచేటట్లు వారికి అవగాహన కల్పిచాలన్నారు.ఈ యొక్క సమావేశంలో సిరిసిల్ల డిఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి,సి.ఐ లు మొగిలి,శ్రీనివాస్,నాగేశ్వరరావు, ఎస్.ఐ లు,సిబ్బంది పాల్గొన్నారు.

# బీజేపీతోనే బీసీలకు న్యాయం

**- బంద్ ఫర్ జస్టిస్ విజయవంతం చేద్దాం**
**- బీసీ రిజర్వేషన్ల పేరిట కాంగ్రెస్ రాజకీయ డ్రామా**
**- హైకోర్టు స్టే తో సర్కారు కుటిల నీతి బయటపడింది.**
**- 18న బంద్ కి బీజేపీ సంపూర్ణ మద్దతు**
**- బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్**

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి:**

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించేందుకు శనివారం (నేడు)18న బీసీ బంద్ ఫర్ జస్టిస్ ని విజయవంతం చేయాలని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ పిలుపునిచ్చారు. వరంగల్ నగర బీజేపీ కార్యాలయంలో బీసీల ఐక్యతకై ఏర్పాటు చేసిన సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్, మాజీ శాసనసభ్యులు వన్నాల శ్రీరాములు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు, కుసుమ సతీష్, రత్నం సతీష్ షా పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ బలహీనవర్గాలకి చట్టసభలలో రిజర్వేషన్లు లేకపోగా, స్థానిక సంస్థలలో ఉన్న రిజర్వేషన్లు తగ్గడం, రిజర్వేషన్లను కాపాడుకోలేకపోవటం వలన బీసీలకి రాజకీయ అవకాశాలు దక్కటంలో అన్యాయం జరిగిందని వాపోయారు.కాంగ్రెస్ పార్టీకి 42 శాతం బీసీ రిజర్వేషన్ అమలు పట్ల చిత్తశుద్ధి లేదని, దీనికి కోర్టు తీర్పు నిదర్శనమని వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ అన్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లపై అమలులో ఎన్నో జాగ్రత్తలు తీసుకోవాలని అప్పుడే ప్రభుత్వానికి సూచించడం జరిగిందని గుర్తు చేశారు. బీసీలను కాంగ్రెస్ మోసం చేస్తోందని ధ్వజమెత్తారు. బీసీ రిజర్వేషన్ల పట్ల సీఎం రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి లేదని,42 శాతం పేరిట కాంగ్రెస్ బీసీలను ఆశల పల్లకిలో ఊరేగించిందని,ఏమీ కాకముందే కాంగ్రెస్ శ్రేణులు పాలాభిషేకాలు చేసుకున్నారని ఎద్దేవా చేశారు.గవర్నర్ వద్ద బిల్లు పెండింగ్ లో ఉండగానే, జీవో తీయడమే రాష్ట్ర ప్రభుత్వం బీసీలను మోసం చేసేందుకే కుట్ర పన్నిందన్నారు. రిజర్వేషన్ల పేరిట బీసీలను మోసం చేసి,రాజకీయ లబ్ధి పొందాలని చూసిందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం తన చేతగాని తనాన్ని ఇతర పార్టీలపై బురదజల్లే ప్రయత్నం చేసి, రాజకీయ పబ్బం గడుపుకుంటున్నారు. రాష్ట్రంలో గందరగోళ పరిస్థితికి కారణం కాంగ్రెస్ ప్రభుత్వమేనని మండిపడ్డారు. ఎట్టి పరిస్థితుల్లో 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాల్సిందేనని అప్పటి వరకు బీసీల పక్షాన తాముండి పోరాడుతామని వెల్లడించారు. స్థానిక సంస్థల్లో గతంలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు ఉంటే, 2019లో 23 శాతానికి కుదించారని, రిజర్వేషన్ల విషయంలో బీసీలకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దడానికి ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వం బీసీలకు రిజర్వేషన్లను 42 శాతానికి పెంచినప్పటికీ, చట్టాలను అడ్డంపెట్టి రిజర్వేషన్లకి అడ్డు పడటం అంటే సామాజిక న్యాయానికి, సహజ న్యాయానికి అడ్డుపడటమే అన్నారు. తెలంగాణ ప్రభుత్వం బీసీలను మభ్యపెట్టకుండా, పార్లమెంటరీ ప్రక్రియ ద్వారా చట్టపరంగా రిజర్వేషన్లు సాధించే ప్రయత్నాలు చేయాలని, రిజర్వేషన్ల సాధనకి సహకరించాలని డిమాండ్ చేసారు. రేపు 18 న జరిగే రాష్ట్రవ్యాప్త బంద్ కి విద్యా సంస్థలు, కళాశాలలు, వ్యాపార రంగాలు మరియు అన్ని వర్గాలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, మాజీ జిల్లా జెడ్పీ వైస్ ఛైర్మన్ గజ్జెల శ్రీరాములు, జిల్లా ఓబీసీ అధ్యక్షులు కందిమల్ల మహేష్, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు ఎర్రగొల్ల భరత్ వీర్, కరీమాబాద్ మండల అధ్యక్షులు బోరిగం నాగరాజు మరియు నాయకులు పాల్గొన్నారు.




# ఏం సాధించారని విజయోత్సవాలు

**- హరీష్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై సూటిగా ప్రశ్నలు - కాంగ్రెస్ 23 నెలల పాలనపై హరీష్ రావు ఆరోపణలు**

డెస్క్ : మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు కాంగ్రెస్ ప్రభుత్వం 23 నెలల పాలనలో ఏం సాధించిందని, ఆస్తులు, హామీలు, సంక్షేమ పథకాలపై మోసాలు చేసి విజయోత్సవాలు జరుపుతున్నారని తీవ్రంగా విమర్శించారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన హరీష్ రావు, "ఏం సాధించామని కాంగ్రెస్ ప్రభుత్వం విజయోత్సవాలకు సిద్ధమవుతుంది?" అని సూటిగా ప్రశ్నించారు. నాయన తుపాకులు పెట్టి వసూళ్లు చేసినందుకా, కమిషన్ల కోసం క్యాబినెట్‌లో గల్లాలు పట్టుకుని కొట్టుకున్నందుకా, మంత్రుల మధ్య తగాదాలు జరుగుతున్నందుకా విజయోత్సవాలు జరుపుతారా అని నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వం 420 హామీలు, ఆరు గ్యారెంటీలను తుంగలో తొక్కిందని, అవ్వాతాతలకు పెన్షన్ ఇవ్వకుండా మోసం చేసిందని, మహిళలకు నెలకు 2500 రూపాయలు ఇస్తారేమో అని ఎదురుచూస్తున్నారని ఆరోపించారు. రైతుబంధు ఇవ్వకుండా, రుణమాఫీ చేయకుండా, గురుకులాల్లో పిల్లలు పిట్టల్లా రాలుతున్నందుకు, నిరుద్యోగులకు నోటిఫికేషన్లు ఇవ్వకుండా విజయోత్సవాలు జరుపుతారా అని హరీష్ రావు తీవ్రంగా నిలదీశారు. ఈ విమర్శలు కాంగ్రెస్ ప్రభుత్వంపై రాజకీయ ఒత్తిడి పెంచాయి.

**- పెట్టుబడిదారులు, పారిశ్రామికులకు బీఆర్ఎస్ అండ: హరీష్ హామీ**

హరీష్ రావు తన మీడియా సమావేశంలో పెట్టుబడిదారులు, పారిశ్రామిక వేత్తలు, సినిమా పెద్దలు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, పేదలకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ప్రభుత్వం మిమ్మల్ని ఇబ్బంది పెడితే మా దృష్టికి తీసుకురండి, మేము కాపాడుతామని, తెలంగాణ భవన్ తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయని తెలిపారు. డీజీపీ శివధర్ రెడ్డి కాకీ బుక్‌లో మంత్రులకు రూల్స్ వేరేలా ఉన్నాయా అని, టెండర్లు వేయొద్దని మంత్రులు బెదిరిస్తుంటే, ముఖ్యమంత్రి సన్నిహితులు తుపాకులు పట్టుకుని తిరుగుతుంటే వారిపై కేసులు లేవని, ఒక ట్వీట్ రీట్వీట్ చేస్తే కేసులు పెట్టి అరెస్ట్ చేస్తున్నారని హరీష్ రావు ఆరోపించారు. ఈ మాటలు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలుగా మారాయి.

- రాజకీయ చర్చకు దారితీసిన హరీష్ విమర్శలు

హరీష్ రావి విమర్శలు తెలంగాణ రాజకీయాల్లో కాంగ్రెస్–బీఆర్ఎస్ మధ్య ఉద్రిక్తతను మరింత పెంచాయి. బీఆర్ఎస్ పార్టీ ఈ విజయోత్సవాలను "మోసాలు"గా పిలిచి, ప్రజలను మరింత గందరగోళం చేయడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులు ఈ విమర్శలను తిరస్కరిస్తూ, "23 నెలల్లో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేశాం" అని స్పందించారు. హరీష్ రావి మాటలు సోషల్ మీడియాలో వైరల్ అయి, బీఆర్ఎస్ అనుకూలవర్గాలు షేర్ చేస్తున్నాయి. ఈ వివాదం రాష్ట్రంలో రాజకీయ చర్చకు దారితీసింది.




# కాకతీయ విశ్వవిద్యాలయంలో బీసీ బంద్ నేపథ్యంలో అక్టోబర్ 18 పరీక్షలు వాయిదా

హనుమకొండ : కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలో బీసీ బంద్ నేపథ్యంలో అక్టోబర్ 18న జరగాల్సిన పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు విశ్వవిద్యాలయ అధికారులు ప్రకటించారు. ఈ మేరకు ఎల్‌ఎల్‌బీ, బీటెక్, ఎమ్మెస్సీ 5 సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ (బయోటెక్నాలజీ మరియు కెమిస్ట్రీ), ఎంటెక్, సీఎల్ఐఎస్సీ (దూరవిద్య) పరీక్షలు వాయిదా పడ్డాయని పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్ తెలిపారు. వాయిదా పడిన పరీక్షల కొత్త తేదీలను త్వరలో ప్రకటిస్తామని, మిగిలిన అన్ని పరీక్షలు షెడ్యూల్ ప్రకారం యథావిధిగా జరుగుతాయని ఆయన స్పష్టం చేశారు. విద్యార్థులు మరిన్ని వివరాల కోసం విశ్వవిద్యాలయ అధికారిక వెబ్‌సైట్ సందర్శించాలని అధికారులు సూచించారు. ఈ ప్రకటన సామాజిక మాధ్యమాల్లో వేగంగా వ్యాపించింది, విద్యార్థులు తమ పరీక్షల తేదీలపై నవీకరణల కోసం వెబ్‌సైట్‌ను తనిఖీ చేయాలని కోరారు. బంద్ కారణంగా ఈ నిర్ణయం తీసుకోవడం జరిగింది, ఇది రాష్ట్రంలో రాజకీయ, సామాజిక చర్చలకు దారితీసింది.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073